క్లుప్తంగా

నేటి నుంచి సీపీఎం జీపుజాత

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోతున్న రైతులను చైతన్యపరిచి వారి పక్షాన పోరాటం చేసేలా సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి జీపు జాతను చేపట్టనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకులమైలారంలో మంగళవారం ఉదయం 9 గంటలకు సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆధ్వర్యంలో జీపుజాత ప్రారంభం కానుందన్నారు. భూములు కోల్పోతున్న యాచారం, కందుకూరు మండలాల్లో ప్రభుత్వం ఇష్టానుసారంగా భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ, ఆయా గ్రామాల్లో రైతులను చైతన్యపరిచే కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడిగా నియమితులైన పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను నాదర్‌గుల్‌కు చెందిన శక్తి కేంద్రం ఇన్‌చార్జి నిమ్మల రవికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త శ్రమించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాకారం చేయాలని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు రాంరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పుల్లారెడ్డి, అంజిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, యాతం వెంకటేశ్, వంక ప్రభాకర్, సతీశ్, జ్ఞానేశ్వర్, నంద, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్‌గా 'బోయపల్లి'

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏఐసీసీ విచార్ బిభాగ్ చైర్‌పర్సన్, ఎంపీ చేతుల మీదుగా రాఘవేందర్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర కాంగ్రెస్ నాయకులకు రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు



యజ్ఞం చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: పుర పరిధిలోని రావిర్యాలలో గల శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం శ్రీలక్ష్మీనర్సింహాస్వామి, భవాని శ్రీరామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. యజ్ఞం చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఏ.వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాలకు అడ్డాగా మారిన రావిర్యాల ఆర్‌సీఐ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, సర్దార్‌నగర్‌రోడ్డులో వీధి దీపాల ఏర్పాటు, స్ట్రీట్ మార్కెట్ వినియోగంలోకి తేవడం తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోధ పాండురంగారెడ్డి, నాయకులు తోడేటి గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మూడు నెలలుగా కటకట

- గ్రామంలో తాగునీటి కష్టాలు
- ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న ప్రజలు



బేగంపేటలో ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుంటున్న ప్రజలు

కందుకూరు: ఆ గ్రామ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. భగీరథ నీటి సరఫరా సరిగా లేదని, మూడు నెలలుగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవం లేదని బేగంపేట వాసులు ఆరోపిస్తున్నారు.

మూడు నెలలుగా..

బేగంపేట గ్రామంలో సుమారు 380కు పైగా ఇళ్లు, 2300 వరకు జనాభా ఉంది. ఇక్కడ ఈ ఏడాది సంక్రాంతి తర్వాత గ్రామంలో తాగునీటికి కటకట నెలకొంది. మిషన్ భగీరథ నీరు.. నాలుగు రోజులకు ఒక్కసారి, ఒక్కో ఇంటికి మూడు నాలుగు బిందెలకు మించి రావడం లేదు. ఇవి సరిపోక పోవడంతో వ్యవసాయ బావులు, బోర్లు ఉన్న ఇళ్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని పలువురు పేర్కొంటున్నారు. బిందెలతో తెచ్చుకోలేని వారు రూ.వెయ్యి చొప్పున ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

తాగడానికి లేవంటే మొక్కలకా..

గ్రామ పంచాయతీకి బోరు బావి ఉంది. దానికి కొందరు రైతులు మోటారు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు నీటిని తరలిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. భగీరథ నుంచి సంపులోకి వచ్చే నీటిని, అటవీ భూముల్లో నాటిన మొక్కల సంరక్షణకు తరలిస్తున్నట్లుగా వెల్లడించారు. తాగడానికి, ఇతర అవసరాలకు నీరు లేక ప్రజలు అల్లాడి పోతుంటే.. అటవీ భూములకు నీటిని ఎలా తరలిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

“గ్రామాలను గాలికి వదిలేశారు



తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగడానికి, ఇతర అవసరాలకు నీరు లేక ఇబ్బంది పడుతుంటే.. పంచాయతీ బోరు నుంచి పంటలకు నీరు తరలిస్తున్నారు. సంపు నుంచి అటవీ భూములకు తరలిస్తున్నారు. ఎవరిని అడగాలో తెలియక రూ.వెయ్యి పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నాము. అధికారులు గ్రామాలను, ప్రజలను గాలికి వదిలేశారు. – యాదయ్య, బేగంపేట

నాలుగు రోజులకు.. మూడు బిందెలు



మూడు నెలలుగా నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాము. నాలుగు రోజులకు ఒకసారి నల్లాల ద్వారా మూడు నాలుగు బిందెలకు మించి సరఫరా కావడం లేదు. బోర్లు ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాము. ఇతర అవసరాలకు ఇబ్బందిగా ఉంది. గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి, నీటి కష్టాలు తీర్చాలి. – జయమ్మ, బేగంపేట

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం: సీనియర్ న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయేల్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు హత్యకు గురైన న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహాయం కోసం వచ్చిన మహిళకు అండగా నిలిచినందుకు దస్తగిరి అనే నిందితుడు న్యాయవాది ఇజ్రాయేల్‌ను కత్తితో అతి కిరాతకంగా పొడిచి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుటివారికి సహాయం చేయడం తప్పా ఇతరులకు హాని చేయరన్నారు. న్యాయవాదిని హత్య చేసిన దస్తగిరిని కఠినంగా శిక్షించి, ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

- ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షయవ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్ క్లోసిస్ కారణంగా సంభవిస్తుందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధి సోకిన వారిలో దీర్ఘకాలిక దగ్గు, రక్తంతో కూడిన చీమిడి, బరువు తగ్గడం, జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. క్షయవ్యాధి సోకిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులను ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం కోసం ప్రతినెల వేయి రూపాయలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ తాజొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

కేశంపేట: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఆధ్వర్యంలో వ్యాధి నిర్మూలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజులుగా కళాశాల ఆధ్వర్యంలో పాపిరెడ్డిగూడ గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె మాట్లాడుతూ.. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహాన్, బిందుశ్రీ, ముంతాజ్‌బేగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: చిలుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

మొయినాబాద్‌రూరల్: ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు ప్రణీత్‌కుమార్ అన్నారు. సోమవారం క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఔషధ తయారీ, శాస్త్రంపై ప్రభావం అనే అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్కో ఫార్మా ఉపాధ్యక్షుడు జ్ఞానదేవ్‌తో పాటు ప్రణీత్‌కుమార్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. చిలుకూరు బాలాజీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ కళాశాల చైర్మన్ రమేశ్‌బాబు, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి, భీమారం అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం సుమారు గంటకుపైగా వడగళ్లతో భారీ వర్షం కురిసింది. ఫలితంగా ఆయా గ్రామాల్లో ఉన్న మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు మామిడి చెట్లు విరిగిపడి, కాయలు నేలరాలా యి. అదేవిధంగా టమాటా, పచ్చిమిర్చి, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా రైతులు భారీగా నష్టపోయారు. రైతులు ప్రభు త్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జికు సన్మానం



రవిని సన్మానిస్తున్న యువకులు

మహేశ్వరం: మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి మాదిగను గ్రామ యువకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఎస్సీల ఎబీసీడీ వర్గీకరణ ఉద్యమంలో పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగ అడుగు జాడల్లో పయనిస్తూ బక్కని రవి మండలంలో ప్రతీ కార్యక్రమం విజయవంతం చేశారని వారు పేర్కొన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని రవి మాదిగ పేర్కొన్నారు. అనంతరం కల్వకోల్ గ్రామస్తులు, యువకులు రవిని ఘనంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బక్కని రవీందర్, రాజు, అశోక్, సిద్దులు, శ్రీశైలం, నాగేందర్, బన్నీ, అరవింద్, చిన్న, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కందుకూరు: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు సోమవారం సాయంత్రం కొత్తగూడకు చెందిన శేఖర్‌గౌడ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

పహాడీషరీఫ్‌లో..



ఇఫ్తార్ విందులో పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ జహంగీరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, నాయకులు చింతకింది నవీన్ గౌడ్, జహీరుద్దీన్, నవాజ్, మల్లిఖార్జున్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో చాకలి చంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు జగదీశ్వర్ రూ.6వేలు, నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ రూ.5వేల చొప్పున ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, నరేశ్‌యాదవ్, గణేశ్‌గౌడ్, రమేశ్, శంకర్, శ్రీధర్, సాయిలు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించకుంటే దీక్ష చేస్తాం

- బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి



మాట్లాడుతున్న నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు తగ్గించకుంటే ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తామని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గ కన్వెన్షన్‌లో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని గతంలో బీజేపీ ఉద్యమాలు చేసిందన్నారు. ఇంటి పన్నులు తగ్గించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో పన్నులు తగ్గించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అడ్మినిస్ట్రేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 27న గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషర్–2 అధ్యక్షుడు తులసి ముఖేశ్‌ముదిరాజ్, కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సోమేశ్వర్, జిల్లా నాయకులు మద్ది రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ దళిత మోర్చా అధ్యక్షుడు కుమార్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలని ధర్నా



స్కూల్ ఎదుట బైఠాయించిన కార్పొరేషన్ అధికారులు, కార్మికులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 16వ డివిజన్‌లో ఉన్న జాన్ మిల్టన్స్ హైస్కూల్ యాజమాన్యం గత 10 సంవత్సరాలుగా ఇంటి పన్ను చెల్లంచలేదు. దీంతో సోమవారం పాఠశాల ఎదుట కార్పొరేషన్ అధికారులు, కార్మికులు బైఠాయించారు. ఇప్పటివరకు రూ.3 లక్షలకుపైగా పాఠశాల నిర్వాహకులు బాకీ పడ్డారని, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఇంటి పన్ను చెల్లించాలని పాఠశాల సిబ్బందిని కోరగా, సహకరించలేనందుకు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్, సెక్షన్ ఆఫీసర్, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్స్, జవాన్‌లు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, స్వీపర్లు తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలి

- ఎమ్మెల్యేకు సీపీఐ నాయకుల వినతి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: చేవెళ్లలోని సర్వే నెం 75లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో సీపీఐ నాయకులు కలిసి గుడిసె వాసులకు ఇళ్లపట్టాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 75 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో పేదలు గత రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. అక్కడ కనీస వసతులు మంచి నీటి సౌకర్యం, కరెంటు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోయినా కాలం వెల్లదీస్తున్నారన్నారని, వారందరికీ మౌలిక వసతులు కల్పించి త్వరగా ఇళ్ల పట్టాలను ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యలపై సానుకులంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మక్బుల్, అంజయ్య, కృష్ణగౌడ్, మంజుల తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కాంతారెడ్డి

- సీఐ కాంతారెడ్డి

షాబాద్: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేది లేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాంలాల్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: మానవ సేవయే మాధవ సేవగా భావించి, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక– వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ సహకారంతో మండల కేంద్రంలోని అన్మాస్‌పల్లి కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి దశరథ్‌నాయక్ ప్రారంభించారు. చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులను స్థానికులు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాఘవేందర్, లాయక్‌అలీ, కుమార్, అశోక్, బ్రహ్మచారి, శివకుమార్, సందీప్‌రెడ్డి, గోపీకృష్ణ, నాగరాజు, గణేశ్, వెంకటేశ్, కుమార్, చంద్రశేఖర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన కందూరి మనోహర్‌రెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కందూరి మనోహర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, సుధాకర్ అప్ప, బాల్‌రెడ్డి, కుడుముల బాల్‌రాజ్, రంగన్నగౌడ్, పులీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.